కాంగ్రెస్‌లో 'మల్లు' చిచ్చు!

- ఢిల్లీలో అధికార ప్రతినిధి పదవికి డాక్టర్ మల్లు రవి రాజీనామా
- ఎట్టిపరిస్థితుల్లో నాగర్ కర్నూల్ ఎంపీగా పోటీచేస్తానని వెల్లడి
- మల్లు నిర్ణయంతో 'భట్టి'కి చెక్
- నాగర్‌కర్నూల్ టికెట్ మల్లుకు ఇస్తే భట్టి భార్యకు రిక్తహస్తమే?
- ఆసక్తి రేపుతున్న టికెట్ల లొల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్ల లొల్లి ఆసక్తికరంగా మారుతున్నది. ఎంపీగా పోటీచేసేందుకు తనకు పదవి అడ్డుకాకూడదని ఢిల్లీలో అధికార ప్రతినిధిగా ఉన్న డాక్టర్ మల్లు రవి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. నెల తిరగకుండానే రవి తన పదవికి రాజీనామా చేయడంపై కాంగ్రెస్‌లో చర్చ నడుస్తున్నది. తనకు ఇచ్చిన నామినేటెడ్ పోస్టు ఎంపీగా పోటీ చేసేందుకు అడ్డంకిగా మారకూడదని, నాగర్‌కర్నూల్ నుంచి తాను పోటీ చేసి తీరుతానని మల్లు రవి శుక్రవారం ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశానని, దానిని ఆమోదిస్తారా? లేదా? అనేది ఆయన నిర్ణయం అని రవి సభాముఖంగా తేల్చిచెప్పారు. జడ్చర్ల కాంగ్రెస్ సమావేశంలో రవి చేసిన ఈ ప్రకటన ఆ పార్టీలో కలకలం రేపింది.

మల్లు రాజీనామాతో చిక్కుల్లో భట్టి

మల్లు రవి చేసిన ప్రకటన ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్న చందంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మెడకు చుట్టుకున్నది. మాజీ ఎంపీ మల్లు రవి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయానా సోదరులు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం (ఎస్సీ రిజర్వ్‌డ్) నుంచి గతంలో రవి ప్రాతినిధ్యం వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తిరిగి ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు రవి టికెట్ ఆశిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా రవికి పేరున్నది. ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ తనదేనన్న ధీమాతో ఉన్నారు. ఇలా ఉండగా ఖమ్మం పార్లమెంట్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భార్య నందిని టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడి నుంచి కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి కూడా టికెట్ ఆశించడంతో రాజ్యసభ సభ్యురాలిగా అవకాశం కల్పించి రేసు నుంచి తప్పించారు. రేణుకాచౌదరికి అనూహ్యంగా రాజ్యసభ సీటు దక్కడం వెనుక భట్టి పావులు కదిపినట్టు పార్టీలో ప్రచారం జరిగింది. ఒక దశలో ఖమ్మం నుంచి పోటీకి భట్టి భార్య నందినికి లైన్ క్లియర్ అయినట్టేనని రాజకీయ పరిశీలకులు అంచనా వేశారు. అయితే మల్లు రవి తన నామినేటెడ్ పదవికి రాజీనామా చేసి, తనకు నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్టే ముఖ్యమని ప్రకటించడంతో ఒక్కసారిగా పరిణామాలు మారిపోయాయి. నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ రవికి దక్కితే, భట్టి భార్యకు ఖమ్మం నుంచి అవకాశం దాదాపు లేనట్టే. కాంగ్రెస్‌లో ఒకే కుటుంబానికి మూడు పదవులు అసాధ్యమని ఆ పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం జోడు పదవులు ఇవ్వకూడదు. ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లోనే మినహాయింపు ఉంటుంది. అలాంటి పరిస్థితిలో ఒకే కుటుంబానికి మూడు పదవులివ్వడం అసంభవమని ఆ పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

రేవంత్‌పై రవి గుస్సా

కోస్గిలో జరిగిన బహిరంగ సభలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా వంశీ చందర్‌రెడ్డి పేరును సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇదే ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్ టికెట్ ఆశిస్తున్న మల్లు రవి అభ్యర్థిత్వంపై సీఎం ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డిపై మల్లు రవి గుస్సా అయినట్టు తెలిసింది. తన నామినేటెడ్ పదవితో ఎంపీ అవకాశాలు తగ్గిపోయే ప్రమాదం ఉన్నదని భావించిన మల్లు రవి తన పదవికి రాజీనామా చేసినట్టు ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

అభ్యర్థుల గరిష్ఠ వ్యయం 95 లక్షలు

- ప్రచార వాహనాల సంఖ్య పెంపు
- 35,356 పోలింగ్ కేంద్రాలు
- 18 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 10 వేలకుపైగా ఓట్ల తొలగింపు
- లోక్‌సభ ఎన్నికలకు ఈసీ కసరత్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): లోక్‌సభకు త్వరలో ఎన్నికలు జరుగనుండటంతో అభ్యర్థుల వ్యయపరిమితిని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఖరారు చేసింది. ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా రూ.95 లక్షలు ఖర్చు చేసేందుకు అవకాశం కల్పించింది. ఎన్నికల ప్రచారం నిమిత్తం ఒక్కో లోక్‌సభ నియోజకవర్గంలో రాజకీయ పార్టీలకు అనుమతి ఇచ్చే వాహనాల సంఖ్యను 5 నుంచి 14కు పెంచింది. గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీల తరపున నామినేషన్లు వేసే అభ్యర్థులను కనీసం ఒక ఓటరు, ఇతర అభ్యర్థులను కనీసం 10 ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నామినేషన్ దాఖలుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500, ఇతర అభ్యర్థులు రూ.25 వేల చొప్పున డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. స్టార్ క్యాంపెయినర్లుగా జాతీయ, ప్రాంతీయ పార్టీలు 40 మందిని, రిజిస్టర్డ్ పార్టీలు 20 మందిని నియమించుకునే అవకాశం కల్పించింది. ప్రతి రాజకీయ పార్టీ తమ మ్యానిఫెస్టోను ప్రకటించిన తర్వాత 3 రోజుల్లోగా ఆ ప్రతులను ప్రాంతీయ భాషతోపాటు హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఎన్నికల సంఘానికి సమర్పించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 3.30 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారి కోసం మొత్తం 35,356 (పట్టణ ప్రాంతాల్లో 14,464, గ్రామీణ ప్రాంతాల్లో 20,892) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా చనిపోయిన, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న 6,36,095 మంది ఓటర్లను తొలగించామని, కొత్తగా 10,55,031 మంది ఓటర్లను జాబితాలో చేర్చామని ఈసీ వివరించింది. 18 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 10 వేల మందికిపైగా ఓటర్లను తొలగించినట్టు వెల్లడించింది. అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 21 వేల మంది ఓటర్లను తొలగించినట్టు తెలిపింది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సీఈవో భేటీ

తెలంగాణలో ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయడంతోపాటు అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై చర్యలు చేపట్టేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల ప్రతినిధులతో మరోసారి సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే చేపట్టాల్సిన తనిఖీలు, వాటికి సంబంధించిన నిబంధనలు తదితర అంశాలను వారికి వివరించారు. ఓటర్లకు నగదు, మద్యం, డ్రగ్స్‌తోపాటు విలువైన వస్తువుల పంపిణీని నియంత్రించడంపై పలు సూచనలు చేశారు. పోలీస్, ఈడీ, రవాణా, పోస్టల్, ఐటీ, సెంట్రల్ ఎక్సైజ్, స్టేట్ ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల ప్రతినిధులతోపాటు డీఆర్ఐ, ఎస్ఎల్‌బీసీ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, స్టేట్ ఏవియేషన్, ఆర్‌బీఐ, నార్కోటిక్స్ బ్యూరో, ఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ తదితర విభాగాల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

అత్యధిక తొలగింపులు ఇక్కడే..

అసెంబ్లీ నియోజకవర్గం	తొలగించిన ఓట్లు
శేరిలింగంపల్లి	21,000
నాంపల్లి	17,930
కోరుట్ల	16,139
పటాన్‌చెరు	14,988
వైరా	14,789
కార్వాన్	13,632
మధిర	13,509
వనపర్తి	13,388
జడ్చర్ల	13,028
మేడ్చల్	12,932
కుత్బుల్లాపూర్	11,763
మునుగోడు	11,653
వరంగల్ వెస్ట్	11,415
ఉప్పల్	11,176
షాద్‌నగర్	11,087
నాగార్జునసాగర్	10,824
సిరిసిల్ల	10,603
కల్వకుర్తి	10,012

కాంగ్రెస్ నేత వికృత చేష్టలు!

- సీసీ కెమెరాల్లో చూస్తూ.. కదలికలు గమనిస్తూ వివాహితపై వేధింపులు
- కామవాంఛ తీర్చకపోతే చంపేస్తానని బెదిరింపులు
- మహిళ ఫిర్యాదుతో అదుపులోకి తీసుకున్న పోలీసులు

మణికొండ, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): నగర శివారులోని హైదర్షాకోట్ గ్రామంలో ఓ కాంగ్రెస్ నేత వివాహితపై వేధింపులకు దిగుతున్నాడు. తన కామవాంఛ తీర్చాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి కథనం ప్రకారం.. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో నివాసం ఉంటున్న ఓ వివాహితను తన కోరిక తీర్చాలంటూ స్థానిక కాంగ్రెస్ నేత సుదర్శన్ అలియాస్ సిద్ధు కొంతకాలంగా వేధింపులకు పాల్పడుతున్నాడు. వివాహిత ఇంటి వైపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఆమె కదలికలను గమనిస్తున్నాడు. నిత్యం ఫోన్ చేసి, వేధింపులకు పాల్పడుతున్నాడు. ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫోన్‌చేసి కామవాంఛ తీర్చకపోతే ప్రాణాలు తీస్తానంటూ బెదిరిస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని బాధిత మహిళ శుక్రవారం నార్సింగి పోలీసులను ఆశ్రయించింది. రెండు నెలలుగా తనకు ఫోన్ చేస్తూ తనతోబయటకు రావాలని, లేదంటే కుటుంబ సభ్యులను చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని పోలీసుల ముందు కన్నీరుమున్నీరయ్యింది. తాను అధికార పార్టీ నేతనని.. తన మాటే ఇక్కడ శాసనమని, ఈ ప్రాంతంలో తాను చెప్పిందే జరుగుతుందితప్ప ఎవరూ తనను ఏమి చేయలేరంటూ బెదిరిస్తున్నాడని వాపోయింది. విషయం కుటుంబ సభ్యులకు చెప్తే కిరాయి హంతకులతో హత్య చేయిస్తానంటూ బెదిరించాడని వివరించింది. ఆ నాయకుడితో తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉన్నదని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి నిందితుడిని విచారిస్తున్నామని ఎస్సై చెప్పారు.

నీట్ లేకున్నా బీఎస్సీ నర్సింగ్!

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): బీఎస్సీ నర్సింగ్ కోర్సులో మేనేజ్మెంట్ కోటా సీట్ల భర్తీపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. నీట్ హాజరు తప్పనిసరి నిబంధన నుంచి సడలింపు ఇచ్చింది. ఈఏపీ సెట్ (ఎంసెట్) హాజరైనా లేదా మెరిట్ ఆధారంగా అయినా సీట్లు భర్తీ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ సడలింపు 2023-24 విద్యాసంవత్సరానికి మాత్రమే వర్తించనున్నట్టు ఆమె ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అవసరమైతే మేనేజ్మెంట్ కోటాతో పాటు కన్వీనర్ కోటాకు కూడా ఇదే నిబంధనను వర్తింపజేయవచ్చని చెప్పారు. మెరిట్ లేదా ఈఏసెట్ లేదా నీట్ ఈ మూడింటిలో దేనికి ప్రాధాన్యం ఇవ్వాలో హెల్త్ యూనివర్సిటీదే తుది నిర్ణయమని పేర్కొన్నారు. బీఎస్సీ నర్సింగ్ చదవాలంటే కచ్చితంగా నీట్ రాయాల్సిందేనన్న నిబంధనతో అటు విద్యార్థులు, ఇటు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు నష్టపోతున్నాయి. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ సూచనల మేరకు కన్వీనర్ కోటాకు ఎంసెట్‌ను ప్రామాణికంగా వర్తింపజేయగా, మేనేజ్మెంట్ కోటాకు మాత్రం ఇంకా నీట్ తప్పనిసరి అనే నిబంధన కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో మేనేజ్మెంట్, కన్వీనర్ కోటా సీట్లు భర్తీ కావడం లేదు. దాదాపు రెండువేలకుపైగా సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. ఈ అంశంపై విద్యార్థులు, వారితల్లిదండ్రులు, ప్రైవేటు నర్సింగ్ కాలేజీల యాజమాన్యం నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందాయి. నీట్‌తోపాటు ఎంసెట్ ర్యాంకు, మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు జరిపేలా అవకాశం కల్పించాలని కోరారు. వీటిని పరిశీలించిన అనంతరం సడలింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మెడికల్ కాలేజీల్లో టీచింగ్ పోస్టుల భర్తీ?

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. కాంట్రాక్ట్ పద్ధతిలో వాటిని భర్తీ చేయాలని నిర్ణయించింది. ఒకటి రెండు రోజుల్లో సుమారు 1,000 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించేందుకు కసరత్తు జరుగుతున్నది. ఇందులో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులు ఉండనున్నాయి. ఇప్పటికే ఏర్పాటైన మెడికల్ కాలేజీలతోపాటు, ఈ ఏడాది ప్రారంభించబోయే కాలేజీల్లోనూ ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. నెల రోజుల్లోగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు తెలుస్తున్నది.

పోస్టుల భర్తీ తర్వాతే మార్కుల జాబితా:ట్రిబ్

హైదరాబాద్, ఫిబ్రవరి23 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లోని అన్నిపోస్టుల భర్తీ తర్వాతే ఆయా క్యాటగిరీల వారీగా కటాఫ్ మార్కుల జాబితాను ప్రకటిస్తామని ట్రిబ్ అధికారులు స్పష్టం చేశారు. దీనిపై అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో 9 క్యాటగిరీల్లో మొత్తంగా 9,210 పోస్టుల భర్తీ ప్రక్రియను ట్రిబ్ ఇటీవల చేపట్టింది. ఇప్పటివరకు ట్రిబ్ భర్తీచేసిన పోస్టులకు 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల మెరిట్ జాబితాలను మాత్రమే ప్రకటించింది. రాతపరీక్ష, డెమో తదితర మార్కులను మాత్రం అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్ ఐడీల్లో పొందుపరిచింది. కానీ వాటిని ఎక్కడా బహిర్గతపరచలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీడబ్ల్యూడీ, మహిళలు తదితర క్యాటగిరీల వారీగా కటాఫ్ మార్కుల జాబితాను కూడా ట్రిబ్ విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో గురుకుల అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కటాఫ్ మార్కుల జాబితాను ప్రకటించక ముందే భర్తీని ఎలా చేపడుతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై 'నమస్తే తెలంగాణ' ట్రిబ్ అధికారులను సంప్రదించింది. అయితే అన్నిపోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయిన అనంతరం క్యాటగిరీల వారీగా కటాఫ్ మార్కుల జాబితాను ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు. ఆ విషయాన్ని నోటిఫికేషన్‌లో పొందుపరిచామని తెలిపారు.

నాగార్జునసాగర్‌లో అరుదైన వాటర్ డాగ్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ జలాశయంలో నీటి కుక్కలు సందడి చేస్తున్నాయి. ఉభయచర జీవుల్లో ఇవి కూడా ఒకటి. అరుదైన ఈ నీటికుక్కలు సాధారణంగా సముద్రతీర ప్రాంతాల్లో కనిపిస్తుంటాయి. తాజాగా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో సందడి చేస్తూ కనిపించాయి. శివాలయం వీఐపీ పుష్కర ఘాట్ వద్ద ఈ వాటర్ డాగ్స్ కలియ తిరుగుతూ వీక్షకులకు కనువిందు చేస్తున్నాయి. సందర్శకులు పెద్ద ఎత్తున వాటి వద్ద ఫొటోలు దిగుతూ, వాటిని వీడియోల్లో బంధిస్తూ సందడి చేస్తున్నారు. రెండేండ్ల క్రితం ఇదే సాగర్ జలాల్లో అటవీ శాఖ అధికారులు కొన్నింటిని గుర్తించారు. ఆ తర్వాత కనిపించకుండా పోయి, తాజాగా మళ్లీ గతంలో కంటే అధిక సంఖ్యలో దర్శనమివ్వడం విశేషం. ఈ జీవులు నీటిలో ఉండే చేపలను ఆహారంగా తీసుకుంటాయని జంతు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

విదేశాలకు ఇద్దరు గొర్రెల స్కాం నిందితులు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): గొర్రెల స్కాంలో ఏసీబీ కేసు నమోదు కాకముందే ఏ1, ఏ2 నిందితులు విదేశాలకు పారిపోయినట్టు సమాచారం. ఈ స్కాంలో ఏ1గా సయ్యద్ మొయినొద్దీన్, ఏ2గా సయ్యద్ ఇక్రముద్దీన్ అహ్మద్ ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ కేసులో సాక్షులుగా ఉన్న వారిని ఆ ఇద్దరు ప్రధాన నిందితులు విదేశాల నుంచే బెదిరిస్తున్నట్టు సమాచారం. ఇదే కేసులో గురువారం నలుగురు నిందితులను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

సెల్లార్‌లో వాచ్‌మెన్ గది నిర్మించొచ్చు: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): అపార్ట్‌మెంట్ సెల్లార్ (స్టిల్ట్ ఫ్లోర్)లో వాచ్‌మెన్ నివాస గదితోపాటు రెండు మరుగుదొడ్లను నిర్మించుకోవచ్చునని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 2012 భవన నిబంధనల ప్రకారం ఆ నిర్మాణాలకు వీలున్నదని గుర్తు చేసింది. 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించేందుకు చట్టంలో వెసులుబాటు ఉన్నదని తెలిపింది. ఈ నిర్మాణాలకు విధిగా ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టీ వినోద్‌కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

జీఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేయండి

హైదరాబాద్, ఫిబ్రవరి23 (నమస్తే తెలంగాణ): ఈ నెల 27న నిర్వహించతలపెట్టిన జీఆర్ఎంబీ (గోదావరి నదీ యాజమాన్య బోర్డు) సమావేశం వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు బోర్డుకు ఏపీ శుక్రవారం లేఖ రాసింది. అదేరోజున ఏపీ సీఎం జగన్‌కు మరో సమావేశం ఉన్నదని, దీంతో బోర్డు సమావేశానికి హాజరుకాలేరని ఏపీ పేర్కొన్నది. ఈ సమావేశాన్ని మరో తేదీకి వాయిదా వేయాలని కోరింది.

పలువురు ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా ఉన్న ప్రశాంత్‌జీవన్ పాటిల్‌ను బదిలీ చేశారు. ఆయనను రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు. ఆయన స్థానంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరిని నియమించారు. మను చౌదరి ఇప్పటివరకు కామారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్నారు. జనగామ జిల్లా కలెక్టర్ శివలింగయ్యను సాధారణ పరిపాలనా విభాగానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో జనగామ జిల్లా కలెక్టర్‌గా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను నియమించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతల్లో ఉన్న సునీల్‌శర్మను రిలీవ్ చేశారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఫలితాలు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్టు శుక్రవారం టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు. ఈ ఫలితాలను టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ 2022, డిసెంబర్‌లో విడుదలయ్యింది.

మాజీ ఐపీఎస్ జన్నత్ హుస్సేన్ మృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): మాజీ ఐపీఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఉమ్మడి ఏపీలో ఆయన ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. పలు జిల్లాల కలెక్టర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు.

అదనపు పీపీల కేసులో హైకోర్టు స్టే

బీఆర్ఎస్‌కు ప్రచారం చేశారని క్రిమినల్ కేసు • హైకోర్టు నిలుపుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన షకీల్, ఎమ్మెల్సీ కవిత తరపున ఎన్నికల ప్రచారం చేశారంటూ బోధన్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీ)లపై నమోదు చేసిన క్రిమినల్ కేసు విచారణను హైకోర్టు శుక్రవారం నిలుపుదల చేసింది. బోధన్ కోర్టులో అడిషనల్ పీపీలు (టెన్యూర్)గా పనిచేస్తున్న జీ శ్యాంరావు, వీ సమ్మయ్య దాఖలుచేసిన క్వాష్ పిటిషన్లపై జస్టిస్ కే సుజన శుక్రవారం విచారణ జరిపారు. బోధన్ పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసుపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు.

కులగణనతోనే బీసీ సబ్‌ప్లాన్ అమలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి23 (నమస్తే తెలంగాణ): బీసీ సబ్‌ప్లాన్ పకడ్బందీగా అమలు కావాలంటే కులగణన జరగాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బీసీ మేధావులు, అధికారులతో శుక్రవారం సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కులగణనకు సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. కులగణనకు బీహార్ రాష్ట్ర విధివిధానాలను, సర్వే తీరును అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కులగణనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని మంత్రి పొన్నం చెప్పారు. సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ మురళీధర్, ప్రొఫెసర్ సింహాద్రి, బీసీ నేత క్రాంతికుమార్, ఆకునూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

యాంకర్‌పై మోజు.. ఆపై కిడ్నాప్

ఉప్పల్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): టీవీ చానల్ యాంకర్‌పై మోజు పెంచుకొని, ఓ మహిళ అతడిని కిడ్నాప్ చేయించిన ఘటన కలకలం రేపింది. వారి చెరనుంచి బయటపడిన యాంకర్ ఫిర్యాదుతో పోలీసులు మహిళను అదుపులోకి తీసుకొన్నారు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగగా తాజాగా వెలుగులోకి వచ్చింది. ఉప్పల్‌లో నివాసముండే ప్రణవ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఓ చానల్‌లో యాంకర్‌గా కూడా పనిచేస్తున్నారు. త్రిష్ణ అనే మహిళ మాదాపూర్‌లో డిజిటల్ మార్కెటింగ్‌లో పనిచేస్తున్నది. రెండేండ్ల క్రితం ఆమెకు ఓ మ్యాట్రిమోనీలో ప్రణవ్ ఫొటో ప్రొఫైల్‌గా కలిగిన ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. అది నకిలీ ప్రొఫైల్ అని తేలడంతో యాంకర్ ప్రణవ్‌కు త్రిష్ణ ఈ సమాచారం అందజేసింది. ప్రణవ్ తన ప్రొఫైల్ వాడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని త్రిష్ణకు సమాచారం అందించాడు. అయితే ప్రణవ్‌పై ఇష్టం పెంచుకున్న త్రిష్ణ అప్పటినుంచి అతడిని ఫాలో చేయడం ప్రారంభించింది. ఫిబ్రవరి 11న అర్ధరాత్రి ఉప్పల్‌లో నలుగురు వ్యక్తులతో కలిసి ప్రణవ్‌ను కిడ్నాప్ చేయించింది.

జర్నలిస్టు శంకర్‌పై దాడి.. ఇద్దరి అరెస్ట్

- మిగతా నిందితుల కోసం పోలీసుల గాలింపు
- వివరాలు వెల్లడించిన ఎల్బీనగర్ ఎస్సై మధు
- శంకర్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

దాడిలో గాయపడిన జర్నలిస్టు శంకర్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): న్యూస్‌లైన్ జర్నలిస్టు శంకర్‌పై దాడి ఘటనలో ఎల్బీనగర్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎస్సై మధు కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, తుర్కయాంజల్‌కు చెందిన చెలమల శంకర్ జర్నలిస్టు. 'న్యూస్‌లైన్' పేరుతో యూట్యూబ్ చానల్, 'తెలంగాణం' పేరుతో తెలుగు ఆన్‌లైన్ పత్రికను నిర్వహిస్తున్నాడు. శంకర్ తన సహచర జర్నలిస్టులు దండిగ నర్సింహా, పుల్కారం శివతో కలిసి సిరీస్ రోడ్డులోని తమ కార్యాలయం నుంచి గురువారం రాత్రి 10:40 గంటల సమయంలో తుర్కయాంజల్‌కు బయలుదేరారు. కారు కొద్దిపాటి దూరం చేరగానే ఓ వ్యక్తి అడ్డుగా వచ్చాడు. దీంతో కారును స్లో చేయగా ఇద్దరు యువతులు హోండా యాక్టివాతో ఢీకొట్